ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరంలో రక్తదాతను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను గజమాలతో సత్కరిస్తున్న ఎన్‌ఆర్‌ఐ తోటక్రిష్ణ తదితరులు

కడప కార్పొరేషన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ శాఖామాత్యులు ఎస్‌బి అంజద్‌బాషా జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం పక్కనున్న క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో భారీ కేక్ తెచ్చి గజమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత ఆయనతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నగర మేయర్ కె. సురేష్ బాబు, డీఎస్పీ ఎస్ఎండీ షరీఫ్, 23వ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సుధాకర్ బాబ్జీ అంజద్‌బాషాకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– ఎన్‌ఆర్‌ఐ ట్రస్ట్ చైర్మెన్ తోటక్రిష్ణ ఆధ్వర్యంలో గజమాల వేసి డిప్యూటీ సీఎంను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పెంచల్‌రెడ్డి, శ్రీను, రవికుమార్ పాల్గొన్నారు.

– జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ప్రారంభించారు. ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పవర్ అల్తాఫ్ తోపాటు డిప్యూటీ సీఎం అభిమానులు రక్తదానం చేశారు. హరూన్ గ్రూప్స్ ఎండీ అహ్మద్‌బాషా, ఉమైర్, రత్నకుమారి, టీపీ వెంకట సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

– కడప నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, సూపరింటెండెంట్ జి. శివకుమార్, ఆర్‌ఐ విశ్వనాథరెడ్డి తదితరులు డిప్యూటీ సీఎంకు స్వీట్లు తినిపించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– నగరంలోని కాంగ్రిగేషనల్ టౌన్ చర్చిలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ ఆధ్వర్యంలో పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రార్థనలు చేసి డిప్యూటీ సీఎంను ఆశీర్వదించారు.

– నూర్ ఏ జహాన్ ఫంక్షన్ హాలులో ఇమామ్‌లకు దుస్తులు పంపిణీ చేశారు. మేయర్ సురేష్ బాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

– ఉమైర్ జ్యూవెలర్స్ అధినేత అల్లాబక్ష్, ఉమైర్ ఆధ్వర్యంలో సాయిపేటలోని బావాసాబ్ మియ్యా ముర్షద్ మసీదుకు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఏపీఎస్ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్ పాల్గొన్నారు.

– జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ ఇమ్రాన్, వారి ఆఫీసు సిబ్బంది, డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగరాజులు డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– రిమ్స్ హాస్పిటల్‌లో మార్కెట్ యార్డు డైరెక్టర్ పి. సంపత్‌కుమార్, మహిళా నేత చైతల్య ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎంకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

– పాత మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో శ్రీరంజన్‌రెడ్డి, ఎం. సుబ్బారెడ్డి, సీహెచ్ వినోద్ కుమార్, వేణుగోపాల్ నాయక్, వెంకట రమణ, డా. శివానాయక్, నాగేంద్రారెడ్డి, బండి ప్రసాద్, షఫీ, బాలక్రిష్ణారెడ్డి, దాసరి శివప్రసాద్, రామలక్ష్మణ్‌రెడ్డి, కె. బాబు, సుభాన్‌బాషా, లక్ష్మినారాయణ, రహీమ్, అర్జున్, గోల్డ్ చాన్, మహిళా నేతలు సంధ్యారాణి, మూలే సరస్వతి, క్రిష్ణవేణి, శ్రీలక్ష్మి, ఉమామహేశ్వరి, సుశీలమ్మ తదితరులున్నారు.

కొత్త సొబగులు

– ఆకర్షణీయంగా తహశీల్దార్ కార్యాలయం

కడప సెవెన్‌రోడ్స్ : కడప తహసీల్దార్ కచేరీ ఇన్నేళ్ల తర్వాత కొత్త సొబగులు సంతరించుకుంది. చరిత్ర కాలగర్భంలో కలిసిపోయి ఒక జ్ఞాపకంగా మిగిలిపోతుందేమోనని పలువురు ఆందోళన చెందారు. అయితే చారిత్రక వారసత్వ భవనం ఇంకా కొన్నేళ్లపాటు ప్రజలకు సేవలు అందించేందుకు అందుబాటులోకి వచ్చింది. ఉన్నతాధికారుల సహకారంతో తహసీల్దార్ శివరామిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించడం ఇందుకు కారణం.

బ్రిటీషు కాలం నాటి ఈ భవనం ఎప్పుడు నిర్మించారో తెలియదు. వంద సంవత్సరాలు దాటి ఉంటుందని అంచనా. దేశంలో ప్రసిద్ధి గాంచిన కడప స్టోన్, గచ్చు, రంగూన్ టేకు, మంగళూరు పెంకులతో నిర్మించిన ఈ భవనం బ్రిటీషు నిర్మాణ శైలికి దర్పణం పడుతోంది. బ్రిటిషర్లు అప్పట్లో ప్రభుత్వ కార్యాలయాన్ని ఒకేచోట నిర్మించేవారు. జిల్లా సచివాలయాల సముదాయంగా పేర్కొనేలా కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయం, ట్రెజరీ, రిజిస్ట్రార్ ఆఫీసు, పోలీసు ఠాణా ఒకే ప్రాంతంలో నిర్మించారు. ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోటున ఉంటే ప్రజలకు సౌకర్యంతోపాటు రికార్డులకు, ఉద్యోగులకు భద్రత ఉంటుందనే ఉద్దేశ్యంతో అలా ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయకపోవడంతో నిన్నటివరకు వర్షం వస్తే ఉరుస్తుండేది. దీంతో రికార్డులు, సిబ్బందికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయితే గోడలు, రంగూన్ టేకుతో తయారు చేసిన వాకిళ్లు, పైకప్పుకు ఉపయోగించిన దంతెలు చెక్కుచెదరలేదు. ఇటీవల జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల మరమ్మత్తులకు కలెక్టర్ అనుమతించి కొంత నిధులు సమకూర్చారు. దీంతో తహసీల్దార్ శ్రద్ధ తీసుకుని పైకప్పులోని చాలా పెంకులు రీప్లేస్ చేయించి రంగులు అద్దించారు.



అందంగా రూపుదిద్దుకున్న తహసీల్దార్ కార్యాలయ లోపలి భాగం



ఉద్యోగుల విధి నిర్వహణకు వీలుగా..



కార్యాలయ వెలుపలి భాగం

కర్ణాటక కార్మికులను రప్పించి..

నీరు కారకుండా కర్ణాటక నుంచి ప్రత్యేక నిపుణులైన కార్మికులను రప్పించి లీక్ ప్రూఫ్ చేయించారు. గచ్చు ఊడిన చోట్ల ప్లాస్టింగ్ చేశారు. పాత తాలూకా స్టేషన్, సబ్ ట్రెజరీ ఉన్న స్థలాన్ని కలిపి కార్యాలయాన్ని విస్తరించారు. ప్రత్యేకించి సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టనున్నారు. కార్యాలయం ఎదుట అందమైన ఆర్చి నిర్మించారు. దీంతో కార్యాలయం చూపరులను ఇట్టే ఆకర్శిస్తోంది.

ఆహ్లాద వాతావరణం



కార్యాలయ సిబ్బంది బాగా పనిచేసే వాతావరణం ఉండాలని రెన్నోవేషన్ పనులు చేపట్టాము. ఎక్కడా హెరిటేజ్ లుక్ దెబ్బతినకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాము. ఫ్లోరింగ్ అంతా మార్చాము. వైర్లు బయటికి రాకుండా ఏర్పాటు చేశాం. ఆర్‌ఐలు, సర్వేయర్ల కోసం ప్రత్యేక శ్లాబ్ భవనాన్ని నిర్మిస్తున్నాం. బాత్‌రూములు ఏర్పాటు చేస్తున్నాం. కలెక్టర్ నిధులు ఇవ్వడం వల్లే సాధ్యమైంది. నా హయాంలో కార్యాలయం సరికొత్త హంగులు దిద్దుకోవడం సంతోషం.

– శివరామిరెడ్డి, తహసీల్దార్, కడప

ఎస్టీఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

కడప ఎడ్యుకేషన్: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ఎస్టీఎఫ్ఐ పతాకాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడం తగదన్నారు. చరిత్రను వక్రీకరిస్తూ విద్యారంగంలో మతోన్మాద విషబీజాలు నాటేందుకు కేంద్రంలోని ఎన్డీయే సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్ బాబు, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివిరమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

చెన్నూరు : స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుని మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం వివిధ పాఠశాల విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణీతలుగా మండలంలోని రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి, అలాగే చిన్నమాచుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివుడు వ్యవహరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎల్లారెడ్డిపల్లె సచివాలయం పరిధిలోని దాదిరెడ్డిపల్లె, ఎల్లారెడ్డిపల్లె, చెన్నారెడ్డిపల్లె గ్రామాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఇంకా పథకాలు రానివారు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమ పథకాలకు కేరాఫ్‌గా మారిందన్నారు. దాదిరెడ్డిపల్లెలో కూలీ పనులకు వెళ్లి తిరిగి వస్తున్న మహిళలతో ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. అలాగే దాదిరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తూ రిటైర్డ్ అయిన దండుబోయిన నాగమ్మ అనే వృద్ధురాలికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అరియర్స్‌ను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రవిశంకర్, చెన్నారెడ్డి, సుబ్బరాయుడు, నాగేంద్ర, వీరభద్ర, భాస్కర్, హరి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, గండి భాస్కర్, ఎన్సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఆర్‌వీఎన్‌ఆర్, కృష్ణారెడ్డి, మస్తానయ్య, నిఖిల్‌రెడ్డి, పెద్దచెప్పలి చిన్ని, సుబ్బారెడ్డి, శేఖర్, గౌస్, సుబ్బన్న, చంటి, చంద్రపాల్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

గండి ఉత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చక్రాయపేట : ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్లను శనివారం పులివెందులలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. ఆలయ అధికారి అలవల పాటి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకుడు కేసరిస్వామి, పాలకమండలి సభ్యులు అందరూ సమష్టి కృషితో ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. తగిన పోలీసు బందోబస్తుతో పాటు, క్యూలైన్ల ఏర్పాటు విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొండూరు మండల ఇన్‌చార్జ్ వైఎస్ మధురెడ్డి, పాలక మండలి సభ్యులు రామాంజులరెడ్డి, అనూషతేజ తదితరులు పాల్గొన్నారు.



గండి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి



బిక్కిపండ్లు

బిక్కి పండ్లు.. భళా కలే పండ్లు..

వైవీయూ: అటవీ ఉత్పత్తులకు ఎప్పుడూ ప్రజల్లో డిమాండ్ ఉంటూనే ఉంటుంది. పల్లె ప్రాంతాలు, అటవీ ప్రాంతాలకు పరిమితమైన బిక్కిపండ్లు (గార్డెనియా లాటిఫోలియా), కలేపండ్లు (క్రిస్సా స్పైనేరియం) కడప నగర ప్రజలకు అందుబాటులో రావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. గ్లాసు రూ.40 నుంచి రూ. 50 చొప్పున కలేపండ్లు, బిక్కి పండ్లు అమ్ముతున్నారు. అద్భుతమైన రుచి, పోషకాహార విలువలు తెలిసిన ప్రజలు కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో మధ్యాహ్నం సమయానికే సరుకు పూర్తిగా అమ్ముడుపోవడంతో పాటు డబ్బులు బాగా వస్తుండటంతో అడవి నుంచి ఇక్కడికి తీసుకుని వచ్చి అమ్ముకుంటున్నవారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా కలేపళ్లలో విటమిన్ సి, విటమిన్ ఏ, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, 10 శాతం మేరకు ప్రొటీన్, 22 శాతం ఫాటీ ఆయిల్, 12.6శాతం ఫాల్మిటిక్ తదితర గుణాలతో చక్కటి పోషక , ఔషధ విలువలు ఉన్నట్లు వైవీయూ బొటానికల్ గార్డెన్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఆచార్య ఎ. మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

అదే విధంగా బిక్కి పండ్లలో విటమిన్ సి లభించడంతో పాటు ఔషధ గుణాలు కలిగి ఉండటం, టైప్-2 మధుమేహవ్యాధి నియంత్రణలో సైతం ఈ పండ్లకు ప్రాధాన్యత ఉందన్నారు. అటవీ ప్రాంతంలో లభించే ఈపండ్లలో చక్కటి పోషకాలు ఉన్నాయని పేర్కొన్నారు.



కలే పండ్లు

క్లుప్తంగా

కలెక్టరేట్ వద్ద ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఫ్యాప్టో నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఉద్యోగ ఉపాధ్యాయులను ప్రభుత్వం విస్మరించడం తగదని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాష్ట్ర పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. జీఓ నెంబరును 117 ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు లక్ష్మీరాజా, మహేష్‌బాబు, వెంకట సుబ్బయ్య, ఇలియాస్ బాష, రమణారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, ఇక్బాల్, అబ్దుల్లా పాల్గొన్నారు.

18న ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం రాష్ట్ర సదస్సు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 18న జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. శనివారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి 9 సంవత్సరాలు అయినా నేటికి ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఉక్కు పరిశ్రమ సాధన కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సుకు అన్ని రాజకీయ, ప్రజా, విద్యార్థి సంఘాల నేతలు, ప్రజలు పాల్గొన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు షాకీర్, విజయ్ పాల్గొన్నారు.

16న రాస్తారోకో

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 16న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా నగరంలోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద రాస్తారోకో చేపడుతున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14 నెలల నుంచి విద్యుత్ వినియోగదారులపై 25 శాతం నుంచి 80 శాతం వరకు అదనపు భారాలను మోపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రారెడ్డి, ఓబులేసు, షాకీర్ విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం చేపడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్యను పూర్తిగా మార్చే విధంగా కుట్ర పన్నుతోందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని కొనసాగించి ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, నగర అధ్యక్షుడు అరుణ్, నాయ కులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు



ప్రజలకు సూచనలు ఇస్తున్న పోలీసులు

కడప అర్బన్: ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, తమ సిబ్బందితో కలిసి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వై.ఎస్.ఆర్ కాలనీలో ఎస్ఐ రవికుమార్ తనిఖీ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

– కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఎర్రముక్కపల్లిలోని పూసలవీధిలో తనిఖీ చేశారు. ఖాజీపేట మండలం చెముళ్లపల్లెలో ఎస్ఐ నర్రెడ్డి రాజరాజేశ్వర్ రెడ్డి తనిఖీ చేశారు.

దుస్తులు పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : ఆజాదికా అమృత్ మహోత్సవ్, నా భూమి–నా దేశం కార్యక్రమంలో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి పేద మహిళలకు చీరెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన తన స్వగ్రామమైన రూకవారిపల్లె బృందావనంలో 50 మందికి స్థానిక ప్రముఖులు సుధారెడ్డి, రామిరెడ్డిల ద్వారా చీరలు, దుప్పట్లను అందజేశారు. లయన్స్ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, గొబ్బూరి కోటేశ్వరరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి పాలకొండ్రాయునికి శ్రావణమాస పూజలు

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని శ్రీ పాలకొండ్రాయస్వామి క్షేత్రంలో ఈనెల 19నుంచి శ్రావణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ జేసు వెంకట సుబ్బారెడ్డి, పాలక మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ మాసంలో మొదటి శ్రావణ శనివారం సందర్భంగా 19న శ్రీ పాలకొండ్రాయస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లకు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, సర్వదర్శనం ఉంటాయన్నారు. రెండవ శనివారమైన ఈనెల 26న స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. మూడవ శనివారమైన సెప్టెంబరు 2న ఉదయం11 గంటలకు క్షేత్ర ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. నాల్గవ శనివారం సెప్టెంబరు 9న ఆలయ ప్రాంగణంలో మహా సుదర్శన హోమం తదితర పూజలు ఉంటాయన్నారు. నాలుగు వారాలు దాతల ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందని వివరించారు.

ప్రతి ఇంట్లో ఒక రక్తదాత తయారు కావాలి

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఇంట్లో ఒక రక్తదాత తయారై ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయాలని నెహ్రూ యువకేంద్ర కో ఆర్డినేటర్ మణికంఠ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సీనియర్ సభ్యులు అబ్దుల్ రాయల్ కరీముల్లా తయారు చేసిన రక్తదానం పోస్టర్లను శనివారం ఆయన నెహ్రూ యువకేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు కొండా సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి తన వంతుగా రక్తదానం చేస్తున్న నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ మణికంఠ అభినందనీయుడన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో ఆదివారం ఉదయం 9 గంటలకు పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసులు, మస్తాన్, మధుబాబు, దేవేంద్ర, సుబ్బరాయుడు తెలిపారు. మున్సిపల్ హైస్కూలు (మెయిన్)లో 1988-89లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమావేశానికి హాజరు కావాలని వారు తెలియజేశారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప ఎడ్యుకేషన్: స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్‌కు సంబంధించిన డైరీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు తమ రోజు వారి కార్యక్రమాలు రాసుకునేందుకు ఈ డైరీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలకు డైరీ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజారెడ్డి, అగ్గిరప్పయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కడప స్పోర్ట్స్: కడప లోని డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాలలో శనివారం అంతర్జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సెట్ప్ సీఈఓ సి. సాయిగ్రేస్, నెహ్రూ యువకేంద్ర అధికారి మణికంఠ, క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డిలు విచ్చేసి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ యువతకు 'గ్రీన్‌స్కిల్స్ : స్థిరమైన ప్రపంచం వైపు' అన్న నినాదంతో ఈ యేడాది అంతర్జాతీయ యువజన దిన్సోతవం జరుపుకుంటున్నామన్నారు. స్వామి వివేకానందున్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. అనంతరం 'నాభూమి.. నా దేశం' కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు.

జిల్లా గ్యాస్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి



బొమ్మిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని సత్కరిస్తున్న గ్యాస్ డీలర్ల అసోసియేషన్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా గ్యాస్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా బొమ్మిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని ఎన్నుకున్నారు. శనివారం జిల్లాలోని గ్యాస్ డీలర్లు సమావేశమై ఈ మేరకు ప్రతాప్‌రెడ్డిని తమ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాలోని గ్యాస్ డీలర్ల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనను అధ్యక్షునిగా ఎన్నుకునేందుకు తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బొమ్మిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని గ్యాస్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.